# అన్నం

తులసీకృష్ణ



శేషమ్మ కొడుకు రోగోడు రాగం తీస్తున్నాడు బూరగలా శ్రుతిపట్టి. ఆరోహణా, అవరోహణా లేదు... వొకే స్థాయిలో జీరంగి మోతలా, కుమ్మరి పురుగు అరుపులా, అదేమొయిన రాలే అసయ్యపు జడివానలా మూలుగుతోన్నాడు. శేషమ్మ పెరట్లో గుంతకుళాయి నించీ బిందెల్తో నీళ్ళుపట్టి యింట్లో ఎక్కడెక్కడ నింపాలో అక్కడంతా నింపుతోంది గబగబా. రోగోడు రాగంతీస్తూ, గుంతకులాయివొద్దున నిలబడతాడు. ఆమె బిందెత్తుకుని యింట్లోకి పోతుంది. వాడి ప్రయాణం మధ్యలోనే మళ్ళా ఎదురవుతుంది. వాడక్కన్నించే వెనక్కి తిరుగుతాడు ఆమెతోపాటు. మళ్ళా కుళాయివొద్దున నిలబడతాడు. ఆమె కదిల్తే కదుల్తాడు, నిలబడితే ఠంచన్‌గా తనూ నిలబడతాడు. హెచ్చు తగ్గుల్లేని వాని యేడుపులాంటిదే వాని నడకగూడా. పుల్లల్లాంటి కాళ్ళు ముందుకు జరపడంలో వొకే విరామం, ఒకేలయ! కాలు వెయ్యడానికంత అలసట పడుతోన్నట్లున్నా, ఆమెటునడిస్తే అటు నడవడం ఆపడు. గొంతెత్తడానికి వోపికలేనట్లు భారమైన జీరపలుకుతోన్నా జ్వరంధ్వనించే ఆ నాదం ఆగదు. పసుపుపచ్చ నరాలు తేలిన ఆ పొట్టలోనించీ, ధ్వని నిరంతరం ప్రకృతి కలకలంలోకి ప్రవహిస్తో వుంటుంది. సాధారణంగా అమ్మా, కొడుకూ యెవరిపని వాళ్ళు చేసుకుంటోంటారు. ఎప్పుడో చిర్రెత్తినప్పుడు శేషమ్మ రోగోని వీపున వొక్కటేస్తుంది, లేకపోతే ఖాళీబిందెతో నడిచేటప్పుడు కాలికడ్డంపడితే తలమీద చిన్నగా, బిందె సొట్టపోకుండా మొత్తుతుంది. అప్పుడు సైతం హఠాత్తుగా శ్రుతి హెచ్చించి అపస్వరం పలకడు ఆ నాదబ్రహ్మ! నిద్రలో వున్నప్పుడు తప్ప జాగ్రదవస్థలో వున్నప్పుడంతా వాడి సాధన సాగుతోంటుంది. రోగోడెందుకెప్పుడూ యేడుస్తాడు? ఏలసలిలంబూపారు? గాడ్పేల విసురు? అంతేనా? అయితే శేషమ్మమాత్రం ఆ యేడ్పుకి కారణం చెబుతుంది. 'ఏముంది? వొకటే పదం బువ్వ...బువ్వ...! యీ పాడు పిల్లోని పీడ పడలేకుండా వున్నాను తల్లీ. ఒకోక్కసారి అర్ధరాత్తిరి లేసి కూసుంటాడు. అప్పుడు బువ్వయినా పెట్టాల... వాడి గొంతన్నా పిసకాల! యేం చేస్తానూ! గొంతు పిసకలేను గదా! యే సావో పడి తెచ్చిపెడతాను. తెల్లవారి లేసింది మొదలు యెనుకబడి తిరుగుతూ యిదో యిదీ పల్లాయి! వాడి ఆకలికీ సావురాదు, వాడికీ రాదు. నడుమ నాకు మాత్తరం సావొచ్చింది తల్లులారా!'

ఊర్మిళకు శేషమ్మ కొడుకునుచూస్తే చెడ్డ చిరాకు! పొద్దున్నే లేస్తూనే వాడు గానీ కనపడితే యిక ఆ రోజంతా ఎందుకనో సుఖంగా వుండదని ఆమె నమ్మకం. ఆ నమ్మకం నిరాధారమైందని వాదించాడొకసారి విజయ్‌కుమార్! 'లేదు ఆ రోజున నేను మనస్సు కష్టపెట్టుకునే సంఘటనలు జరుగుతాయి అంటుంది ఊర్మిళ. ఈరోజు పొద్దున్నే శేషమ్మ కొడుకును చూశాననే భయపడ్డావుగదా! మరి నువ్వు బాధపడే సంఘటనలేమీ జరగలేదుచూడు. మనకు మూఢనమ్మకాలెక్కువ!' అంటూ వుపన్యాసమివ్వబోయేడు విజయకుమార్. "పొద్దున్నే వాణ్ని చూశానుగదాని అక్కయ్యేయిందాకా మనసు కష్టపెట్టుకుంటోంది గదా, అంతకంటే యింకేం బాధ కలగాలి!" అంది శైలజ. అంతా నవ్వేశారు. ఆ పాడు పిల్లాన్ని చూల్లేక శేషమ్మనే పని మానుకోమందామంటుంది ఊర్మిళ. శేషమ్మ పని బావుంటుంది, శ్రద్ధగా చేస్తుంది, దొంగకాదు. మానుకోమంటే అటువంటి మనిషి మళ్ళా దొరకదని యింట్లో యితరుల అభిప్రాయం. అందువల్ల శేషమ్మకొడుకు యింకా ఆ యింటిపై పోస్తున్నాడు. మొత్తానికి ఊర్మిళంతగా తిట్టకపోయినా వాన్నిచూస్తే ఆ

యింట్లో అందరికీ అసహ్యమే. ఇంటి దగ్గరుండమంటే వుండక తనవెంటొచ్చి, వాళ్ళందరిచేతా అసహ్యించుకో బడుతున్నందుకు శేషమ్మకూ కోపమొస్తుంది వాడిపైన. అంతకంటే రోగోని విషయంలో ఆ యింటివాళ్ళకున్న ఆసక్తి మరీ భరించరానిదిగా వుంది. "నువ్వు చూస్తే గుమ్మటంలా వున్నావు; యీ తొండగాడు నీకెట్లా పుట్టినాడే!" అని పెద్దమ్మగారు రెండురోజుల కోసారన్నా పెద్దగా ఆశ్చర్యపడుతుంది. పలక్కుండా వున్నా వూరుకుంటుందా? "ఏమే పలకవు!" అని పొత్తి అడుగుతుంది. "ఎట్లా పుట్టినాడంటే మామూలుగనే..." విరగబడి నవ్వుతుంది పెద్దమ్మగారు. ఎవరూ చేయని తప్పుడు పని తానొక్కతే చేసినట్లనిపిస్తుంది శేషమ్మకు. ఆమె నిజంగా గుమ్మటంలా లేదు. కానీ ఆ పెద్దమ్మగారు అట్లా అన్నప్పుడు తాను గుమ్మటంలా వున్నందుకు సిగ్గుపడుతుంది. రోగోడు తన కొడుకులా లేకపోతే తానయినా రోగోని తల్లిలాగా వుంటే బావుండేదనుకుంటుంది.

"శేషమ్మ గుమ్మటంలావుంటే సరిపోయిందా! మొగుడూవుండొద్దూ?" అంటుంది ఊర్మిళ. అక్కన్నించీ పెద్దమ్మగారు శేషమ్మ మొగుణ్ని గురించిన పరిశోధన ప్రారంభిస్తుంది. ఎత్తూ, లావు, తూకమూ, రంగూ, వయసూ, అన్ని వివరాలూ అందుమూలంగా రాబడుతుంది. అంతటితో అయిందా, "మరి మీ యిద్దరికీ వీడెట్లాపుట్టినాడూ?" అని పెద్దసైజులో ఆశ్చర్యపడుతుంది. తానేగాక మొగుడు కూడా ఆరోగ్యంగా వుండడం యింకా యిబ్బందిలో పెడుతుంది శేషమ్మను.

"ఒడ్డూ పొడుగూవున్న వాళ్ళంతా ఆరోగ్యవంతులయినట్లు కాదు, పరీక్ష చేస్తే జబ్బులుండొచ్చు" అంటుంది పద్మ.

"ఈ యిద్దరిలో యెవరికి జబ్బులుండొచ్చు!" అని ధర్మసందేహం లేవదీస్తుంది పెద్దమ్మగారు.

"ఒకరికనేమిటి? యిద్దరికీ వుండగూడదూ?" శేషమ్మ గుండె గుబగుబమంటుంది.

"అంతేకాదు, పోషకాహార లోపం వల్లగూడా వాడట్లా కావచ్చు," అంటుంది మళ్లా పద్మ.

"వాడికేం లోపం? యెప్పుడూ తింటూనే వుంటాడుగదా!"

"తిండే సరిపోయిందీ! ఆహారంలో శరీరాని కవసరమైన విటమిన్లు వుండొద్దూ!"

"ఆ సంకటీ, జొన్నరొట్టెలే వాడికి పెట్టలేక చస్తూంటే, విటమిన్లెక్కడ పెడుతుందిలే శేషమ్మ పాపం!" అని జాలిపడి ఆ వెంటనే "విటమిన్లూ, గిటమిన్లూ అదంతా వొట్టిది. శేషమ్మలాంటి వాళ్ళంతా పిల్లలకేం మింగబెడుతున్నారు. అంతా కర్మకొద్దీ జరుగుతుంది" అంటుంది. వైద్యశాస్త్రాన్ని అవమానించడం పద్మ వొప్పుకోదు. మంచి ఆహారమిచ్చి, తగిన ట్రీట్మెంటిస్తే వాడు తప్పక ఆరోగ్యవంతు డౌతాడని సవాల్ చేస్తుంది. "ఆ...వాడి మొహం వాడి బతుకంతే! గర్భంలోనే యేదో తాకింది," అంటుంది చప్పరిస్తూ పెద్దమ్మగారు.

"కర్మా గిర్మా యేంలేదు శేషమ్మా! మంచి డాక్టర్ దగ్గిర మందులిప్పించూ, వాడెందుకు బాగైపోడో చూస్తాను?"

"డాక్టర్లంటే జ్ఞాపకమొచ్చింది, నిన్న యిచ్చిన కొత్తమందులు మీ నాన్నచేత తాగించినావు? పో పో... ముందు ఆ పనిచూడు, శేషమ్మ కొడుకును నువ్వేం బాగుచేస్తావు కానీ"

"ఓ... నాన్నసంగతి మరిచిపోయినాను" అంటూ మేడపైకి మెట్లమీదుగా యెగుర్తూ వెళుతుంది పద్మ. వెంకటస్వామి యే వేళకు, యే మందు, యే మాత్రలు తీసుకోవాలో ఆ విషయమంతా చూసుకునేది పద్మ. మిగతావాళ్ళంతా ఆ బాధ్యత తను ఆమెకు గుర్తుచేస్తారు. మెడికల్ ఎన్ట్రెన్స్ రాసివచ్చిన పద్మకు ఆ బాధ్యత గర్వకారణంగా వుంది. ఆ అమ్మాయి పైకొచ్చేసరికి ఆయన పెరటివైపున్న కిటికీదగ్గర కుర్చీలో కూర్చున్నాడు. శేషమ్మ బట్టలుతికి ఆరవేస్తోంది. కొడుకు మామూలుగానే ఆ మెటుతిరిగితే అటు తిరుగుతూ మూలుగుతోన్నాడు.

"నాన్నా! టానిక్ తీసుకరానా!"

"ఆ..."

రెండురకాల టానిక్కులూ తాగించింది. మరో రెండో మూడో రకాల సన్నమాత్రలు మింగించింది. ఈ మందులూ, మాత్రలూ మింగేటప్పటికి ఆయాస మొచ్చినట్లు కుర్చీలో వాలిపోయాడు.

"ఇవాళెట్లాగుంది?"

"మామూలే...తేన్పులుగూడా వస్తున్నాయి." పద్మ పరుగెత్తికెళ్ళి యింకో చోట్నించీ తెచ్చి తేన్పులమందూ మింగించింది. "కొంచెం వేడి ఉప్మా తీసుకురానా?"

"ఉహూ... కడుపులో నిండుగా వున్నట్లుంది" అన్నాడు నీరసంగా.

"సరే... యింకొంచెం సేపుండి వస్తాను."

"యింకొంచెం సేపు కాదు, యింకొన్నాళ్ళున్నా యింతే ననిపిస్తోంది."

"అదేంకాదు. జబ్బుగా వున్నప్పుడు అట్లాగే వుంటుంది. తొందరలో బాగవుతావు. ఆకలొచ్చేస్తుంది చూడు, శేషమ్మ కొడుకుకున్నట్లు,'' అని నవ్వింది పద్మ నాన్నను హుషారు చెయ్యడానికి. వెంకటస్వామి పెరటికేసి చూశాడు.

"వాడికంత ఆకలా?"

"అంతాయింతానా? పెట్టేస్తావుంటే తినేస్తావుండాడట, పెట్టేస్తావుంటే తినేస్తా

వుంటాడట ! తింటున్నప్పుడు మాత్రం వూరుకుంటాడట. మానేస్తానే యేడుపు సాగిస్తాడట ! వాడి ఆకల్తో చచ్చి పోతున్నానంటోంది శేషమ్మ."

"అంత తింటే వాడికేంకాదూ ?"

"అదే చిత్రం, యేమీకాదంట. అంటే వొకటిలే... తిన్నదంతా మళ్ళా బైటికి పోతూనే వుంటుందట ! అట్లా పోనూ, యిట్లా వెయ్యనూ !"

''వాడేడ్చేది అన్నంకోసమేనా ?"

"ఏడ్చేదెందుకో తెలీదు. తెలిసిందల్లా తింటున్నప్పుడు మాత్రం యేడ్వడని!"

వెంకటస్వామి వాడికేసి చూస్తూండగా పద్మ కిందికెళ్ళిపోయింది. నాన్నకు చూపడానికన్నట్లు ప్లేటులో, ఉప్మా మాడుచెక్కలు వేసుకుని పెరట్లో కొచ్చింది. తిట్టడానికొచ్చిందేమో నని శేషమ్మకొడుకు గోడవారగా కూర్చొని బెదురుబెదురుగా చూస్తోన్నాడు. ఉప్మా ప్లేటు, నీరసమైన వాడి కళ్ళలో మెరుపులు పుట్టిస్తున్నట్లుగా అదే చూస్తోన్నాడు. ఎన్నిరోజుల్నించో ఆకల్తో వున్న కదల్లేని కుక్కలా చూస్తోన్నాడు. ప్లేటుముందుకు చాచింది పద్మ. ఆ శరీరంలో ఆ చైతన్య మెక్కడుందో, అందుకోడానికి వాడూ చేయిసాచాడు. పద్మ నవ్వుతూ చేయివెనక్కి తీసుకుంది. వాడిచేయి పట్టుతప్పిన తీగెలా వాలిపోయింది. మళ్ళా ముందుకు చాచింది పద్మ. వాడికి జరిగిన అవమానం అప్పుడే మరిచిపోయినాడు ! ఆ అమ్మాయి మళ్ళా వెనక్కి ! ఈ ఆట అయిన తర్వాత సిల్వర్ ప్లేటు వాడి ముందు పెట్టింది. వాడు తినడం ప్రారంభించాడు. పైన వెంకటస్వామి, కింద పద్మ చూస్తోన్నారు. రోగోడు మిగతా ప్రపంచాన్ని గమనించలేదు. మనోవాక్కాయకర్మలా తిండికి అంకితమై పోయినట్లున్నాడు. కుక్క తిండిపెట్టినందుకు కృతజ్ఞతగా తోకాడిస్తూవుంటుంది యెంత వోపిక లేక పోయినా. అట్లాంటి కృతజ్ఞత వాడిలో లేదు. వేరే యెట్లాంటి భావాలూ మిగుల్చుకో లేనంతగా వాడు తినడానికి అర్పణమై, ఆకలికి దర్పణమై కనిపించాడు.

ఎక్కడ చూసినా తెల్లని గుట్టలు... యేమిటా గుట్టలు ? అరె... ఆ గుట్టలు జరిగిజరిగి వొక్కటిగా అయిపోతున్నాయి? ఇప్పుడు వొకే వొక్కటి. ఎత్తుగా, తెల్లగా...హిమాలయ పర్వతమా ? ఎందుకు కనపడాలిప్పుడు తనకు ? దగ్గరగావెళ్తే? తను వెళ్ళాడా ? అదే వచ్చిందా? ఏమో! పెద్దపెద్ద మంచు గడ్డలు. మంచుగడ్డల్లా లేవే ! చిత్రం... అన్నంమెతుకులు, ఒక్కో మెతుకు దూలంలా యెంత పెద్దది ! ఇప్పుడు పెద్దవిగా లేవు, మామూలుగా వున్నాయి అన్నంరాశి మాత్రం పెద్దకొండలా కనపడుతోంది. ఒకవైపు శిఖరం మీదినించీ జారుతోంది... రాశి తరుగుతోంది. ఎందుకు తరుగుతోంది ! చూస్తోన్నాడు. ఏదో చిన్న పురుగు గబగబా అన్నం రాశిని తొలిచేస్తోంది. ఇంతచిన్న పురుగు యింతరాశిని ! ఎంత శక్తి దానికి ! ఏం పురుగు ? వుల్లల్లాంటి కాళ్ళు... చేతులు గూడా ! యీ పురుగును యింతకు ముందు చూసినట్లు ! అరె శేషమ్మ కొడుకు !

అంతా చెదిరిపోయింది. దృశ్యం మారిపోయింది. ఏవో కేకలు! "తన్నండి ! కొట్టండి !" యేమిటి యెక్కడ ! యేమీ కనపడదే, కనపడుతోంది. ఓరినీ...యిది తనిల్లేనన్నమాట! అడుగో తనూ, తన పెళ్ళామూ, పిల్లలూ ! యింకా యెవరెవరో గుంపు. ఏం జరిగింది ? తన యింట్లో యేంజరిగిందో తనే అడుగుతున్నాడు. చెప్పారో, తనకే తెలిసిందో. వాడు అడుగో ఆ నల్లటివాడు తన యింట్లో దొంగతనం చేశాడు. అక్కడే బీరువాలో డబ్బూ, విలువైన బట్టలూ, యింకా



యేమేమో వున్నాయి. ఆ దొంగమాత్రం వంటింట్లో కూచొని అన్నం తింటోన్నాడు. "రెండో సినిమానించీ వీళ్ళు రాకపోతే అవన్నీ యెత్తుకపోయేవాడే!" అంటున్నారెవరో. వాన్ని పట్టుకు తన్నడంలో అన్నం చెల్లాచెదరైంది. అన్నం పళ్ళెంలో వాడి రక్తం కలిసింది. వాడు అన్నంకేసి చూస్తున్నాడేకానీ, బీరువాకేసీ, బట్టలకేసీ చూడటమేలేదు !

చిన్నపిల్లల బడి ! కుంటిమేస్టారు కూర్చునున్నాడు. ఈయన తనకుతెలుసు, పేరుగూడా తెలుసు. వేమయ్య ఆయనకు చాలామంది పిల్లలు. వాళ్ళు కూలిపనికి పోతూంటారు. ఆయన బడిపిల్లల్ని వొక్కొక్కర్ని పిలుస్తున్నాడు దగ్గరికి. ఏమడుగుతున్నాడు ? ఎక్కాలా ?

లెక్కలా? "అన్నం తిన్నావా? యెంత తిన్నావు? అంతేనా! ఆకల్లేదూ...ఆకల్లేకపోవడమేం? ఆకల్లేకుండా వుంటుందా ప్రాణమున్న వాడికి! సర్లే... యేం కూరలు? యింకేం, కడుపునిండా వేళా వన్న మాట. ఏదీ అబద్ధం చెప్పావో, లేదో నీ కడుపుచూసి కనుక్కుంటాను. బాగా యేసినావురోయ్...తినకేం, నీకేం దొబ్బుడాయా? తినేసుంటావు మస్తుగా. నెయ్యీ, పప్పు, చారూ, పెరుగేసుకో లేదూ! ఎందుకేసుకోవూ? మీగడ పెరుగు జుర్రేసుంటావు... లేదూ? దొంగగాడిదా, యిట్లా రా... చెయ్యి వాసనచూసి చెప్పేస్తాను."

వేమయ్యటీచర్ రిటైరయినాడు. ఇంకేమైనాడు? ముసలివాడైనాడు. ఇంటింటికి తిరిగి...చదువు చెప్పేవాడా? కాదు... అడుక్కునేవాడు, అన్నం అడుక్కునేవాడు. అప్పుడూ అంతే. ఇంటి ముందు కనిపిస్తే, బువ్వతిన్నావా! హాయిగా బువ్వతిన్నావన్న మాట! ఎంత తిన్నావ్? దండిగా తినుంటావు... నాకు తెలుసు."

కూలీలు వరుసగా కూర్చున్నారు. ఒకామె గంపతో సంగటి వడ్డిస్తోంది, తలావొక సంగటిముద్ద! ఆముదం దీపపు వెలుగులో, ఆకలిముఖాలు కనిపిస్తున్నాయి. ఒక్కొక్కరూ, ఆ గంపను మొత్తంగావిరిచి మింగేట్లు చూస్తోన్నారు. అయినా వొక్కముద్దే తినవలసి వుంటుంది. లోపలి భయంకరమైన మంటలు ఆరవు... యింకా గుప్పుమంటుంది. ఆ వేడి వాళ్ళ ముఖాల్లోకి పాకుతుంది. ఆ ముద్ద తినాలంటే నిముషం పట్టదు, అయినా వాళ్ళు అరగంట తింటారు. ఉన్న ఆకలి లేనట్లూ, లేని సంగడి వున్నట్లూ వూహించుకుంటూ, ముద్దచుట్టూ కొంచెం కొంచెంగా గిళ్ళి, వేళ్ళు నాక్కుని, నాలుగుసార్లు నీళ్లుతాగి (నీళ్ళకు కొలతలేదు) తింటున్న అనుభవాన్ని వీలైనంతా పెంచుకుంటూ, ఆఖరుకు నిట్టూర్చి...

"నాన్నా! లే. లే... యిప్పుడు నిద్రేమిటి!" తట్టింది పద్మ. కళ్ళు చెరిచాడు వెంకటస్వామి.

"పన్నెండు దాటింది, కిందికిపద!"

"ఎంతయితేనేం? ఆకల్లేందే!" అన్నాడు నిట్టూర్చి.

"అయినంతే కొద్దిగానే తిందూ, అమ్మ రమ్మంటోంది పద!" పద్మ ఆసరాగా కిందికొచ్చాడు.

* * *

వెంకటస్వామి... కాదు వెంకటన్న పొలాల్లో కూలిపని చేశాడు. శరీరాన్ని పిండి చెమట కార్చాడు. బీట్లోనూ, పైరులోనూ, గొంతుకూర్చొని యెడమ అరచేత గుండ్రాయిలాంటి సంగడి ముద్ద పెట్టుకుని కుదురుచేపి దాంట్లో పప్పో, పచ్చడో వేసుకుని అపురూపంగా తిన్నాడు. అట్లాంటి వెంకటన్నకు రంగయ్యశెట్టి దగ్గర నౌకరీ దొరికింది. రంగయ్య ఆ వూళ్లో కిరాణాకొట్టు పెట్టుకున్నాడు. పట్నం పోయి, సరుకులు తీసుకురావడానికి వెంకటన్న కుదిరాడు. కిరాణాకొట్టే కాకుండా, రంగయ్య రకరకాల వ్యాపారాలు చేసేవాడు. ఎండాకాలం రెన్నెళ్ళు వొక వ్యాపారం చేస్తాడు. రైతులు వేరుసెనగవేసిన పొలాల్లో, పైరు వొడుపుకుని, రాలిన కాయలూ, భూమిలోపోయిన కాయలూ, సేద్యంచేసి సాధ్యమైనంతా యేరుకుంటారు. ఇంకా భూమిలో మిగిలిపోయినవి, బీదా బిక్కీ, కూలీజనం యేరుకుంటారు. ఆ వ్యాపారలలో మంచి లాభమున్నట్లు రంగయ్యశెట్టి కనిపెట్టాడు.

జేబులో డబ్బువేసుకొని, వెంకటన్న నెత్తికి గోనెసంచులెత్తి పొలాల్లోకి పోతాడు. ఏ చెట్టునీడనో కాలువ దీరుస్తాడు. రోజంతా నేల గోకిగోకి వేళ్ల చితగ్గొట్టుకుని, ఆకలికి, దప్పికి అల్లాడిపోయి యేరుకున్న కాయల్ని శెట్టి కమ్ముతారు. వాటిధర తెలీదు వాళ్ళకు. తెలిసినా యేమీ చెయ్యలేని అవసరం. తూకంలో మోసాలూ అంతతెలీవు. అతనెంతిస్తే అంత చేతపట్టుకుని, వుప్పు, మిరపకాయా వొచ్చినంతా కొనుక్కుని వెళ్ళిపోతారు. ఒక్కో సందర్భంలో ఆ వుప్పూ, మిరపకాయా యిచ్చేది గూడా, యింటిదగ్గర కిరాణాకొట్టు నడిపే రంగయ్యశెట్టి భార్యే! అట్లాకాయలు కొని రంగయ్య ఆఖర్న పట్నంలో అమ్మేస్తాడు. పదికిలోల కాయలకు ఐదురూపాయలు పెట్టిన పెట్టుబడి ఇరవైరూపాయల అమ్మకం తేలుస్తుంది. నికరలాభం పదికిలోలకూ పదిహేను రూపాయలు! వెంకటన్న యీ వ్యాపార రహస్యాలు అర్థంచేసుకుంటూండగానే రంగయ్యశెట్టి తేలుకుట్టి చనిపోయాడు. ఉన్న అనుభవంతోనూ, ఇల్లు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బుతోనూ, రంగయ్యశెట్టి వ్యాపారాలన్నీ నడపడం ప్రారంభించాడు వెంకటన్న. వెంకటన్న, వెంకటయ్యగా తీరి పల్లెలో పట్టనంతవురువై, పట్నంలోనే మకాం పెట్టాడు. పెట్టుబడి పెట్టకుండానే లాభాలువచ్చే వ్యాపారంలో వుత్సాహంతో దూకాడు. ఒక గోడనే అద్దెకు తీసుకుని, దగ్గర్లో ఆఫీసుకొక గది తెరచి, అందులో ఫోన్ పెట్టుకుని, పట్టుపరుపులు పరిచి కూచున్నాడు. రైతులు వేరుసెనక్కాయలు బండ్లమీద వెంకటయ్య గొడౌన్‌కి తోల్తారు. ఆ సరుకును ఆయన అక్కన్నే కూచొని వక్కపొడి నముల్తూ, సిగరెట్ పీలుస్తూ, ఫోన్ ద్వారా మార్కెట్ రేటుకు విక్రయిస్తాడు. ఆ డబ్బు తన కందేదాకా రైతును, రేపు రా...మర్నాడు రా...అని తిప్పేస్తాడు గోడౌన్ అద్దె, తూకాలకు, నంచులకు, తన మెయింటెనెన్స్ ఖర్చులు గూడా రైతుద్వారా రాబడతాడు. వెంకటయ్య — వెంకటస్వామి అయాడు.

బంగళాలాంటి యిల్లు, కారు, డబ్బు, పెద్ద సంసారం, అంతకంటే పెద్ద పరపతీ వచ్చేశాయి. పెద్దకూతురు ఊర్మిళకు యాభై వేలు కట్నమిచ్చి పెళ్ళిచేసేశాడు ఆమె కిద్దరు పిల్లలు! మూడో కాన్పుకు పుట్టింటికొచ్చింది. కొడుకు విజయకుమార్‌కు లక్షరూపాయలకట్నం తీసుకుని పెళ్ళిచేశాడు. కోడలు కాన్పుకు వాళ్ళ పుట్టింటికి పోయింది. ఇంక శైల, పద్మ పెళ్ళికావలసినవా ళ్లున్నారు. పద్మను డాక్టర్ చెయ్యాలి. శైలకు పద్దే కట్నం డబ్బు రాబట్టడానికి, కాలేజీలో చదివే యింకో కొడుకున్నాడు. ఈ మధ్య వెంకటస్వామి ఆరోగ్యం బాగులేనప్పట్నించీ వ్యాపారమంతా విజయకుమార్ చూసుకుంటున్నాడు.

* * *

డైనింగ్ టేబిల్ మీద రకరకాల కూరలున్నాయి. మాంసం... గుడ్డు... తీపి, అన్నీ వున్నాయి, కడుపులో ఆకలి మాత్రమే లేదు. వెంకటస్వామి యేదో అయిందనిపించుకుని లేచాడు. మిగిలిన అన్నం, కూరలూ యెత్తేస్తోంది వంట మనిషి. ఈ యింట్లో మనుషులుకూడా రోజుకు రెండుసార్లు అన్నం తింటోన్నారు. అయితే ఆకలేసి మాత్రంకాదు. ఇంతకుముందు కనిపించిన దృశ్యాల గురించి ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. కలగన్నాడా? ఊహించుకున్నాడా? తెలీడంలేదు. ఎంత బాగున్నా యవి! అన్నం అట్లా తినగలగడం, అది చూడగలగడం, యెంత గొప్ప అనుభవం! అట్లా అన్నం తినగలగడానికీ, భక్తుడి ఆరాధనకూ తేడా యేముందీ! అన్నం తినడం కాదు ప్రధానం, అన్నం అంత యిష్టంగా తినగలగడం ప్రధానం. అది పవిత్ర కార్యం. ఆ పవిత్రత తనకు లేదు, తన సంపాదన అనుభవిస్తోన్న వాళ్ళకూ లేదు. వెంకటస్వామి వెంకటన్నను గురించే ఆలోచిస్తున్నాడు. అతను ఆకలిని చూశాడు, అనుభవించాడు. ఆకలికి అన్నం సమర్పించుకున్న ఆనందమూ అనుభవించాడు. వెంకటస్వామి కెన్నో సుఖానుభవాలు దొరికినై, కానీ ఆ గొప్ప అనుభవం దొరకడంలేదు. "లక్షాధికారైన లవణమన్నమెకాని" అవును పేరుకున్న తన డబ్బు ఆ అనుభవాన్ని దూరం చేసింది. తనచుట్టూ అన్నం విలువ తెలీని అంధులు, కొవ్వెక్కిన సోమరి శరీరాలు! ఏ సినిమాల్ని గురించో ఫ్యాషన్లగురించో చర్చించుకుంటూ అన్నం కెలికి లేచి పోయే వాళ్ళకు, అన్నం యివ్వగలిగిన మహత్తర అనుభవం యెట్లా తెలుస్తుంది? తనకూ యిన్నాళ్ళు తెలిసినట్లు లేదు. ఇప్పుడు తెలుస్తోంది, ఎట్లా తెలుస్తోంది? ఒకప్పుడు తాను వెంకటన్నగా వుండగలిగిన అదృష్టంవల్ల తెలుస్తోంది. తనకుఆకల్లేకపోవటం వల్లగూడానా? కావచ్చును. తానింకా బతికితే యెందుకు బతికినట్లు! తనకు శృంగారంతో అవసరంలేదు. పిల్లల అభివృద్ధి చూడటానికా? వాళ్ళకేం? డబ్బు సంపాదించిపెట్టాడు ఏ సమస్యలూ లేవు వాళ్ళకు. చెడిపోకుండా కాపాడాలా? ఎంతమంది పిల్లలు, పంద్రులున్నా చెడిపోలేదు? అసలివన్నీ తనకు సంబంధించినవేనా? పిల్లల బాధ్యత, శృంగారం, యే యితర అనుభవాలకంటే మనిషికి ఆకలే బలమైంది. ప్రాణముందని నిరూపించేది అదొక్కటే!




రోజూ పొద్దున్నపూట కొంచెం దూరం నడిస్తే మంచిదని డాక్టర్ సలహా యిచ్చాడు! కానీ వెంకటస్వామి నడవలేడు. పెద్ద ఏనుగ శరీరం, పొట్ట! కూర్చున్నా ఆయాస మొస్తోంటుంది. బైటికివెళితే కారులోవెళ్ళిరావడం అలవాటయింది యెన్నో యేళ్ళుగా.

ఒక్కరంటే వొక్కరు, వొక్కసారంటే వొక్కసారి, తన యింట్లో వాళ్ళు ఆకలేసి అన్నం తింటారేమో, ఆ దృశ్యం చూడాలని కాచుకున్నాడు వెంకటస్వామి. వాళ్ళకళ్ళలో అన్నంపట్ల నిర్లక్ష్యంతప్ప గౌరవం కనపడదు. ఎప్పుడైనా, యెవరైనా, "ఆకలేస్తోంది బాబూ యివాళ!" అన్నా, ఆ "ఆకలి" వుత్తిమాట మాత్రమే! కాకపోతే గారాబం. అన్న సంతర్పణ చేయిస్తే, అందులో బిచ్చగాళ్ళ గొడవా, కొట్లాటలూ, కక్కూర్తై గానీ చూడాలనుకున్నది చూల్లేడు.

* * *

మధ్యాహ్నం రెండుగంటలయింది. అంతా భోజనాలుచేసి గదుల్లో విశ్రాంతి

తీసుకుంటున్నారు. పెరట్లో పూల మొక్కలకు నీళ్లు పారడానికి పాదు చేస్తోంది శేషమ్మ. కొడుకు దగ్గరే యెండలో నిలబడున్నాడు. "ఎండలో నిలబడకు, యిప్పుడే రోగిముండాకొడుకువు" అని గదమాయించి ఆమె తీసుకెళ్ళి చెట్టునీడన కూలబెడుతుంది. వాడు మళ్ళీ వస్తాడు యేడుస్తూ, వెంకటస్వామి మెల్లిగా మేడదిగి కిందిహాల్లో కొచ్చాడు. ఎవర్నయినా పిలుద్దామని నోరెత్తబోయాడు మళ్ళా మానేసి, వంటగది తలుపు తోశాడు.

శేషమ్మ ఆశ్చర్యంగా చూస్తోంది. వెంకటస్వామి చేయిపట్టుకుంటూనే రోగోడు యేడుద్దామనే అనుకున్నాడు. ఆయన చేతిలోని అన్నంప్లేటు అడ్డు పడింది. వాన్ని చెట్టుకింద కూచోబెట్టి, నిల్చోలేక తనూ చతికిలబడ్డాడు. 'పిచ్చేమన్నా యెక్కిందా?" అనుకుంటోంది శేషమ్మ. రోగోడు అన్నంకేసి. ఆయన ముఖంకేసి మార్చిమార్చి చూస్తూన్నాడు. వెంకటస్వామి నవ్వేశాడు. ఈ మధ్య చాలా రోజులుగా నవ్వే అవకాశం రాలేదుఆయనకు."ఊ...కానీ,"అన్నట్లు తలూపాడు. ఒకటి, రెండు ముద్దలకు వాడు, వెంకటస్వామి అక్కడున్నట్లు మరిచిపోయాడు.. అరమోడ్పు కన్నుల్తో నములుతున్నాడు! అంత అన్నం తినలేడని చెప్పాలనుకుంది శేషమ్మ. ఇప్పుడు వాన్ని కొట్టి, లాగి గొడవచేస్తే కానీ వదిలిపెట్టడు. అయ్యగారేమనుకుంటారు? అంత యిష్టంగా పెడుతున్నప్పుడు. వాడికేసి చూస్తోన్నకొద్దీ వెంకటస్వామికి తను పొరపాటు చేసినట్టు అర్థమవుతోంది. ఆ అరమోడ్పు కన్నుల్లోవున్నది పారవశ్యం కాదు, అలసత్వం. ఆనందంతో తినడం లేదు వీడు. మొండి అక్కసుతో తింటున్నట్లున్నాడు. తను చూడాలనుకున్నది యిదికూడా కాదు. పొరపాటయింది. ఇంక ఆపమని అన్నంప్లేటు లాగేస్తే! ఎట్లా చూస్తాడు వాడు? ఆపేదా? వద్దా?

అంతలో ఊర్మిళ పెరట్లోకొచ్చింది. ఆశ్చర్యంగా చూసింది ఆ దృశ్యాన్ని. తను యేదో ఆవేశంచేత యిట్లా చేసినట్లనిపించి సిగ్గు కలిగింది వెంకటస్వామికి. లేచి నెమ్మదిగా యింట్లోకెళ్ళిపోయాడు. ఊర్వశి కొడుకునసహ్యంగా చూసి, లోపలికెళ్తూ, శేషమ్మకేసి పరిశీలనగా చూసింది. ఆమె ఆలోచిస్తోంది: "ఆ పురుగ్గాడికి, వొంటరిగా...అహ... శేషమ్మ వుండగా అంత శ్రమపడి స్వయంగా నాన్న అన్నంపెట్టడంలో అర్థమేమిటి? కథల్లో చెప్పినట్లూ ఆ శేషమ్మతో నాన్నకేమైనా... అంటే ఆ పురుగ్గాడు నాన్నకు...ఛ...ఛ యాక్! అమ్మతో చెప్పాలా! వద్దా! ఇంకోసారిట్లా జరిగితే చూద్దాం."

మరుసటిరోజు శేషమ్మ పన్లోకి రాలేదు. విచారిస్తే, రోగోడుకి బావుండ లేదని ఆస్పత్రికి తీసుకెళ్ళిందని తెలిసింది. తరువాత రెండురోజులు వీళ్లు విచారించలేదు, యే సంగతీ తెలీలేదు. వెంకటస్వామికి కొంచెం ఆందోళనగానే వుంది. మేడపైన, పడకమీదుండే ఆలోచిస్తున్నాడు. ఊర్మిళ వగరుస్తూ, ఖారంగా పైకొచ్చింది.

"రోగోడు చచ్చిపోయాడట!" ఉలికిపడ్డాడు.

"ఎవరు చెప్పారు?"

"శేషమ్మ..."

"శేషమ్మ కిందవుందా!" అన్నాడు ఆ గొంతుకొంచెంగా వణికింది. 'ఆ...' అంది. నిజంగానే సంబంధమున్నట్లుంది, లేకపోతే తన కెందుకు దుఃఖం? శేషమ్మతో పనేముంది? వాడు చావడం మంచిదే అయింది. లేకపోతే వాడికి వాటా రాసిపోతే! ఈ మాటలు చెప్పడానికి తను తావడంలో కారణ మిదే! బైటపడింది. పీడగూడా పోయింది. వెంకటస్వామి, "కిందికి పోయి శేషమ్మను పలకరిద్దాంపద!'' అందామనుకున్నాడు. ఈ కళ్ళలోనే నేరారోపణ కనిపిస్తోందే, యిక శేషమ్మ యెట్లా చూస్తుంది? ఉహూ... యెదురుగ్గా వెళ్లలేడు.

"కిందికి పోదాం పద."

"వద్దులే, పాపం శేషమ్మనెట్లా పలకరించేది?" అన్నాడు మెల్లిగా.

"శేషమ్మను పలకరించడమెందుకూ? పలకరిస్తే మాత్రం నీకు బాధెందుకు? వాడికన్నం పెట్టావుగానీ, విషంపెట్టలేదు. వాడసలే రోగోడు-చచ్చాడు. సరే పద...అన్నానికి వేళయిందని అమ్మరమ్మంటోంది" మొదట తీవ్రంగానూ, కొస మెత్తదనంతోనూ అంది.

'అవును... రోగోడికి విషమే పెట్టాను. ప్రాణాన్నిచ్చే అన్నాన్ని, ప్రాణంతీసే విషంగా మార్చేశాను. అసలు నేనే విషాన్ని... అందుకే యీ చేదులో అన్నం రుచి తెలీడంలేదు. నేను అన్నంతింటూ వుండటమే అన్నంవేసిన శిక్ష! ఇంక నాకు బ్రతుకంటే ఆ శిక్ష భరించడమే!' అనుకున్నాడు వెంకటస్వామి ఖారంగా.

